విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్టానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మారేడ్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పెద్ద ఎత్తున పుస్తకాలను అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు వైసీ సుంకీ, టి. స్వరాజ్, రాంచందర్, డిమ్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత

రాంగోపాల్‌పేట్: తన చుట్టూ ఉండే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రతి పౌరుడు జాగ్రత్తలు తీసుకోవాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర సూచించారు. బుధవారం ఉజ్జయినీ మహంకాళి దేవాలయం ప్రాంతంలో పారిశుధ్య కార్మికులకు త్రిచక్ర తోపుడు బండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పగలు రాత్రి తేడా లేకుండా పారిశుధ్య కార్మికులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారని ఆమె అభినందించారు. అనంతరం అనంతరం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ధనాగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు చీర శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓయూలో ప్రొ.కోదండరామ్‌కు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల సమస్యల పరిష్కారం విషయంలో ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ పై నమ్మకం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ప్రొ.కోదండరామ్‌కు ఆర్ట్స్ కాలేజీలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి పీటీఎల్ రాష్ట్ర సంఘం అధ్యక్షులు డా. సోమేశ్వర్ అధ్యక్షత వహించగా ప్రొ.హరగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొ.కోదండరామ్ రాష్ట్ర విద్యా శాఖమంత్రి కావాలని పలువురు వక్తలు కోరారు. తద్వారా రాష్ట్రంలో ఎల్‌కేజీ నుంచి వర్సిటీల వరకు విద్యా రంగ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించారు. పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని పీటీఎల్ అధ్యక్షులు సోమేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.సుల్తాన, డా.జానకి రెడ్డి, డా.దుబ్బ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి


ఆదం సంతోష్‌కుమార్‌కు సమస్యల నివేదిక అందజేస్తున్న సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు దృష్టి సారించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్‌ను కలిసిన ఆయన సమస్యలపై నివేదికను అందజేశారు. అనంతరం కాంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు తాగునీరు, రహదారులు, మురుగునీటి సమస్యలతో సతమతం అవుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిచిపోయిన అడ్డగుట్ట, లాలాపేట్‌లలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం పూర్తి చేయించాలన్నారు. దూద్‌బావి, సాయి నగర్ ప్రాంతాల్లోని డబుల్‌బెడ్ గృహాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు వర్సిటీల్లో రిజర్వేషన్లు అమలు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ప్రవేటు వర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈఎస్‌డబ్ల్యూ, మైనార్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ బుధవారం డిమాండ్ చేశారు. రిజర్వేరేషన్లు అమలు చేయనందున పేద విద్యార్థులక అన్యాయం జరుగుతుందన్నారు. మల్లారెడ్డి డీమ్డ్ వర్సిటీ, నీలిమా మెడికల్ కాలేజీల్లో రిజర్వేషన్లు అమలు చేయకుండా అడ్మిషన్లు కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు అమలైయ్యే వరకు కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలన్నారు. వైద్య విద్య సంస్థల యజమానులైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే వెంకటరణమరెడ్డిలను పార్టీల నుంచి సస్పెండ్ చేయాలన్నారు. కౌన్సెలింగ్‌ను ఆపకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలి


'శ్రీమద్భాగవతం' ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

సనత్‌నగర్: కష్టసుఖాలను సమానంగా స్వీకరించగలిగే తత్వాన్ని మన గ్రంథాలు అందిస్తాయని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగే 'శ్రీమద్భాగవతం'పై ప్రవచన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రవచనకర్త వద్దిపర్తి పద్మాకర్ మాట్లాడుతూ భాగవతాన్ని చదవడంతోనే కాదని, అందులోని అంశాలను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జీఎస్‌టీ శాయి అన్నారు. కాగా గురువారం సాయంత్రం కూడా ప్రవచనం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గౌహతిలో గ్రేటర్ కార్పొరేటర్లు

లాలాపేట: జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి నేతృత్వంలో కార్పొరేటర్ల స్టడీ టూర్ కొనసాగుతోంది. బుధవారం అస్సాం రాష్ట్రంలోని గౌహతీ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి చెత్త డంపింగ్ స్టేషన్‌ను సందర్శించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసే విధానాలను స్వయంగా పరిశీలించడంతో పాటు ప్రాసెసింగ్‌లో వాడుతున్న టెక్నాలజీపై అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం

లాలాపేట: తార్నాకలోని సరోజిని నాయుడు వనితా ఫార్మసీ మహావిద్యాలయంలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఇండియన్ ఫార్మాస్యూటికల్స్ అసోసియేషన్(ఐపిఏ), తెలంగాణ రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఐపీఏ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రసిడెంట్ డాక్టర్ బి. ప్రభాశంకర్, జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్ రెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు ఫార్మాస్యూటికల్ ఫీల్డ్ ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో బల్క్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ జాతీయ ప్రసిడెంట్ ఆర్. ఆగర్వాల్, ఇండస్ డ్రగ్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలంగాణ ప్రసిడెంట్ రాజమౌళి పాల్గొన్నారు.



ఇంకెన్నాళ్లు?

- వాన వస్తే సికింద్రాబాద్‌లో భయం.. భయం..
- చెరువు, కుంటలను తలపిస్తున్న రోడ్లు

వర్షం వస్తేచాలు..రోడ్లపైకి నీళ్లు...మృత్యుముఖాల్లా తెరుచుకున్న డ్రైనేజీ మ్యాను హోల్స్...ఎక్కడికక్కడ గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ వంటి సమస్యలు లష్కర్‌లో ఆవిష్కృతమవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షం సికింద్రాబాద్ వాసులను ఇబ్బందులు పెడుతోంది. వరదనీటి ప్రవాహం..ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మోకాలులోతు వరకు వరదనీరు వచ్చి చేరడంతో వాహనచోదకులు..పాదచారులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు వరదనీటి కారణంగా అనేక ఇక్కట్లకు లోనవుతున్నారు.

- భారీ వర్షం వస్తే పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని దండు నివాసం ముందు, రాణిగంజ్ ముంబయ్ హోటల్ సమీపంలోని రోడ్డు పై, బన్సీలాల్‌పేట్, బోయిగూడ వై జంక్షన్, పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని సాయికిరణ్ అపార్టుమెంట్ ముందు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు, ఓలిపెంటా బ్రిడ్జి, ఓల్డ్‌బోయిగూడ, లాలాగుడి, చాచానెహ్రూనగర్ ప్రాంతాల రోడ్లు జలమయంగా మారుతున్నాయి.
- లోతట్టు ప్రాంతాలు చిన్న పాటి నీటి కుంటలు....చెరువులను తలపిస్తున్నాయి.
- వర్షం వచ్చినప్పుడు వరదనీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు తాత్కాలిక చర్యలతో కాలం గడుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి సమస్య ఉత్పన్నమవుతున్నా శాశ్వత పరిష్కారానికి అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు శూన్యం.
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు, ఓలిపెంటా బ్రిడ్జి, ఓల్డ్‌బోయిగూడ, లాలాగుడి, చాచానెహ్రూనగర్ ప్రాంతాల రోడ్లు జలమయంగా మారుతున్నాయి.
- రోడ్లకు ఇరువైపులా వరదనీరు పావడానికి ఏర్పాటు చేసిన క్యాచ్‌పీట్లు చెత్తాచెదారం మట్టితో నిండిపావడంతో వరదనీరు ముందు వెళ్ల లేక రోడ్లపైనే ఉంటున్నాయి.
- సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా పౌర సరఫరాల గోడౌన్ సమీపంలోని రోడ్డుపై పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరుతోంది. దాంతో ఈ రోడ్డుపై రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతున్నది.

వరదనీటి సమస్యలపై చర్యలు

డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

వరదనీటి సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. బేగంపేట్ సర్కిల్ పరిధిలో ఎక్కడ కూడా రోడ్లపై వరదనీరు నిలువకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. ప్రత్యేకంగా మాన్‌సూన్ బృందాలు ఇందు కోసం పని చేస్తున్నాయని వివరించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు వరదనీటి సమస్యలను పర్యవేక్షిస్తున్నాయి.

లక్షలు వెచ్చిస్తున్నా..

వర్షాకాలంలో వరదనీటి కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా జీహెచ్ఎంసీ, జలమండలి తరఫున లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక మాన్‌సూన్ వాహనాలు, సిబ్బందిని ఏర్పాటు చేసి లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయితే సమస్య ఉత్పన్నమైనప్పుడు సదరు సిబ్బంది స్పందించడం లేదు. దీంతో ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు.

ఎన్‌బీటీనగర్ ఎన్నికల ప్రక్రియపై విచారణ చేపట్టండి

బేగంపేట ఏసీపీకి ఫిర్యాదు చేసిన పోటీదారు చిరంజీవులు


బేగంపేట ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న అందజేస్తున్న చిరంజీవులు

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పరిధిలోని పాటిగడ్డ ఎన్‌బీటీనగర్ బస్తీ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగలేదని, కొన్ని అనుమానాలు ఉన్నాయంటూ బస్తీ ఎన్నికల్లో పోటీ చేసిన చిరంజీవులు బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల నేపథ్యంలో తన బృందంతో కలిసి తమ బస్తీలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల సమగ్ర జాబితాను రూపొందించామన్నారు. అయితే అనేక ఓట్లు సరైన సమాచారం లేకుండా తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే కొన్ని ఓట్లను సమాచారం లేకుండా చేర్చారన్నారు. ప్రత్యేకంగా అప్పర్ ఎన్‌బీటీనగర్ ఓటర్లను జాబితా నుంచి తీసివేశారని ఆరోపించారు. ఎన్నికల రోజు ఓటరు జాబితాను తనకు అందజేయలేదన్నారు. ఓటరు జాబితా కాపీ, పోలింగ్‌లో పాల్గొన్న వారి సంఖ్య, ఎన్నికల ఫలితాలు, ఇతర సంబంధిత సమాచారంపై విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన తప్పిదాలు మీ విచారణలో తేలితే మరోసారి ఎన్నికలు జరపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కూలిపోయిన దుకాణాలను పరిశీలించిన అధికారులు


ఘటన స్థలాన్ని సందర్శించిన తహసీల్దార్ పాండు నాయక్

పద్మారావునగర్: సికింద్రాబాద్ మోండా డివిజన్ ఓల్డ్‌జైల్ ప్రాంతంలో నేలకూలిన దుకాణాల సముదాయాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు సందర్శించారు. ప్రమాదం జరిగిన విషయాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్ బాధితులను పరామర్శించి దుకాణాల పంచనామాను నిర్వహించారు. బాధితుల నుంచి పలు వివరాలను సేకరించారు. మోండా మార్కెట్ ఓల్డ్‌జైలు ప్రాంతంలో నేలకూలిన దుకాణాల సముదాయం బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి విజ్ఞప్తి చేశారు. టైలరింగ్ జీవనాధారంగా బతుకులీడుస్తున్న బాధితులను ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు.

ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలి

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌లో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని స్థానికులు మంత్రిని కోరారు. ఈ మేరకు బుధవారం నాయకులు ఆదం సంతోష్ ఆధ్వర్యంలో పలువురు గాంధీ భవన్‌లో ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి బస్తీలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో మాణికేశ్వర్‌నగర్ నాయకులు ఆలకుంట గణేష్, బోదాసు నర్సింహా, పల్లపు ప్రసాద్,దాస్, సుధాకర్,కేజి శ్రీనివాస్, బోదాసు శ్రీనివాస్ తదితరులున్నారు.

రైల్వే పెన్షనర్ల నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విశ్రాంత రైల్వే ఉద్యోగులు

సికింద్రాబాద్: కేంద్ర ప్రభుత్వం రైల్వేద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రైల్వే విశ్రాంత ఉద్యోగులు బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. చిలకలగూడలోని జాతీయ రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రదర్శనలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల దేశ వ్యాప్త నిరసనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఎనమిదవ వేతన సంఘాన్ని ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయడంతోపాటు 18 నెలల కరువు భత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమమంలో ఫెడరేషన్ ప్రతినిధులు వై.యుగంధర్, ఎన్.రాజు, కెఎన్.స్వామి, శివకుమార్, గిరిజ తదతరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులు అర్పిస్తున్న వెల్లాల రామ్మోహన్..

సనత్‌నగర్: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం సనత్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు కార్యక్రమంలో వెంకట సుబ్బారావు, రామ్‌ప్రసాద్, చైతన్య, సీవీ శ్రీనివాస్ తదితులు పాల్గొన్నారు.



లాలాపేట: తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

సికింద్రాబాద్: చిలకలగూడ కూడలిలో గురువారం దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేశ్ నేతృత్వంలో నిర్వహించిన వేడుకలకు మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, పార్టీ నాయకులు కనకట్ల హరి, అంబాల రాజేశ్వర్‌రావు, వేంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

అర్హులకు 'గృహజ్యోతి' అందేలా చర్యలు


కట్టమైసమ్మ బస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులైన వారికి గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంటు అమలయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీచ్చారు. రసూల్‌పురా కట్టమైసమ్మ బస్తీలో బుధవారం విద్యుత్ విభాగం అధికారులు విద్యుత్ బిల్లులు చెల్లించని వినియోగదారుల కరెంటు మీటర్లు తొలగించి వెంట తీసుకెళ్లడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో పలువురు విద్యుత్ విభాగం అధికారుల తీరుపై ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీగణేష్ కట్టమైసమ్మ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గృహ అవసరాలుక 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు కావడం లేదని ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని శ్రీగణేష్ స్థానికులకు హామీచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

లష్కర్ అభివృద్ధికి సహకరించండి


మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతిపత్రం అందిస్తున్న మర్రి రాఘవయ్య, ఆదం సంతోష్‌కుమార్

సికింద్రాబాద్: మురికివాడలకు నిలయంగా ఉన్న సికింద్రాబాద్ నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్‌లు కోరారు. వీరిరువురి నేతృత్వంలో పలువురు ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనేందుకు గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు నియోజకవర్గ సమస్యలు, ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రం అందించారు. అనంతరం ఆదం సంతోష్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయించేందుకు మంత్రి దామోదర రాజనరసింహా హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నేత భరణిభానుప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, గుంటి కృష్ణ, షకీల్‌ఖాన్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అమీర్‌పేట: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 28న లోక్ అదాలత్ ఉంటుందని చెప్పారు. ప్రజలు పంతాలు, పట్టింపులకు పోకుండా కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. లోక్అలత్‌లో కేసుల పరిష్కారం కోసం ఏవైనా సందేహాలు ఉంటే తనను కాని, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగాన్ని సంప్రదించాలని కోరారు.

నరేష్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లైబ్రెరీ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో గంధసిరి నరేష్‌కు పీహెచ్‌డీ డిగ్రీ లభించింది. సిటీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ చేగోని రవి కుమార్ పర్యవేక్షణలో ద రోల్ ఆఫ్ వర్సిటీ లైబ్రెరీ ఇన్ ప్రొవైడింగ్ మెటీరియల్స్ ఆఫ్ కాంపిటీషన్ ఎగ్జామినేషన్స్ టు ద యూజర్స్ ఇన్ తెలంగాణ అనే అంశం పై పరిశోధన చేసినట్లు తెలిపారు.

బల్కంపేట దేవాలయ హుండీల లెక్కింపు


హుండీ డబ్బులను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం హుండీలను అధికారులు లెక్కించారు. బుధవారం 52 రోజుల వ్యవధి కలిగిన హుండీలను లెక్కించగా ఆలయానికి మొత్తం రూ.51,48,685 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో అన్నదానం రూపంలో రూ.76,270 రాగా 180 అమెరికా డాలర్స్, 20 న్యూజిలాండ్, 2000 ఇండోనేషియా కరెన్సీ,9 మలేషియా,10 యూరో కరెన్సీలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.కృష్ణ, ఛైర్మన్ సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న మేకల సారంగపాణి

బౌద్ధనగర్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బుధవారం బౌద్ధనగర్ డివిజన్ ఎల్ నారాయణ నగర్ బూత్ కోఆర్డినేటర్ యాదమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బిజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఇప్పటివరకు అత్యధిక శాతం సభ్యత్వ నమోదు చేయించినట్లు తెలిపారు. సుమారు 60 వేల సభ్యత్వ నమోదు టార్గెట్ చేసుకొని ప్రతీ కార్యకర్త ఇంటింటికీ తిరిగి సభ్యత్వం చేయిస్తున్నారని తెలిపారు.డివిజన్ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్, సత్యనారాయణ, వనమాల శ్రీనివాస్, ఓములు ముదిరాజ్, శ్యామ్ ముదిరాజ్, మమత, జయశ్రీ, దేవుడు కుమార్, ప్రతాప్ కుమార్, భిక్షపతి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. గోపాలపురం ఎస్ఐ వేణుగోపాల్ తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన లాల్‌సింగ్ (32) గత మేనెలలో హయత్‌నగర్‌లో ఉన్న మామ రాకేష్ బన్వర్‌లాల్ వద్దకు వచ్చాడు. ఇదిలా ఉండగా కొద్ది రోజుల నుంచి లాల్‌సింగ్ మానసిక స్థితి సరిగా లేదు. దీంతో ఈ నెల 19వ తేదీ రాజస్థాన్‌కు వెళ్లేందుకు స్టేషన్‌కు మామతో కలిసి వచ్చాడు.లాల్‌సింగ్‌ను కూర్చోబెట్టి టికెట్ కొనుగోలు కోసం రాకేష్ వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చేసరికి లాల్ సింగ్ కనిపించ లేదు. స్థానికంగా వెతికినా అతను కనిపించకపోవడంతో గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.